క్లుప్తంగా

ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో ఉంచాలి



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చీమకుర్తి: ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో ఉంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేవరాజు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వాసుబాబు, నాగుల్‌మీరా, శ్రీకాంత్, దుర్గారావుతో కలిసి చీమకుర్తి ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈఓ కె.శివాజీకి వినతిపత్రం అందించారు. ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుల్లో పెట్టకపోవడంతో ఇష్టమొచ్చినట్లు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఫీజులను వసూలు చేస్తున్నారని, పాఠ్య పుస్తకాలపై అత్యధిక రేట్లకు విక్రయిస్తున్నారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు విజ్ఞప్తి చేశారు.

26న బాప్టిస్ట్ సంఘ కాపరుల సమావేశం

చీమకుర్తి: బాప్టిస్ట్ సంఘ కాపరుల సమావేశం ఈనెల 26న విజయవాడలో జరుగుతుందని పాస్టర్ ఫెడరేషన్ సంతనూతలపాడు ఇన్‌చార్జి రెవరెండ్ నెహెమ్యా మంగళవారం చీమకుర్తిలో ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న బాప్టిస్ట్ సంఘ కాపరులంతా ఈ సమావేశంలో మొదటి సారిగా పాల్గొంటున్నట్లు తెలిపారు. బాప్టిస్ట్ సంఘాల్లో సమైక్యత, దేశ సమగ్రతపై చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో ఉన్న బాప్టిస్ట్ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

త్రిపురాంతకం: బడి ఈడు పిల్లలందరినీ తల్లిదండ్రులు పాఠశాలలకు పంపాలని ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. మండలంలోని సోమేపల్లిలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో బడి ఈడు పిల్లలని పాఠశాలలకు పంపాలని ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలకు రాని విద్యార్థులందరినీ ముందుగా గుర్తించాలన్నారు. పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు బాల వెంకట కుమార్, సీఆర్పీ డానీబాబు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ తెలిపారు. ఎంపీసీ గ్రూపులో సుమారు 25 సీట్లు ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన బాలికలు పాఠశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9493175298, 9052057089, 9912269224ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఘనంగా కోటి కుంకుమార్చన

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో కోటి కుంకుమార్చన పూజలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం ఉభయదాతలు మేడా నరసింహారావు, రమాదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. లోక కళ్యాణం కోసం సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చక సలహాదారులు మురళీకృష్ణామాచార్యులు చెప్పారు. పూజల అనంతరం భక్తులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, ఎస్.నాగేశ్వరరావు, పి.భాస్కర్, వెలిశెట్టి నారాయణ, సామి రాజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వినతి



కోన శశిధర్‌తో మాట్లాడుతున్న రవిచంద్ర, కృష్ణ

మార్కాపురం: విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్‌ను పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి రవిచంద్ర అమరావతిలో మంగళవారం కలిశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. డీఈఓ పూల్, హిందీ సబ్జెక్టు సమస్యలను వివరించామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి శ్రవణా నక్షత్ర పూజలు



పూలంగి సేవలో శ్రీవారు



పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో:

క్రోధి నామ సంవత్సరం జేష్ఠ మాసం మంగళవారం శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నగరంలో పలు వైష్ణవాలయాల్లో ప్రత్యేక అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం, సమతా నగర్ లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు జరిగాయి. గాంధీ రోడ్ లో వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారిని పట్టు వస్త్రాలతో వివిధ రకాల పుష్పాలతో పుష్పాలంకరణ గావించి అష్టోత్తర శత నామావళి పూజ క్రతువులను నిర్వహించారు.

అధికారుల సహకారం మరవలేను



కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ వీడ్కోలు సభలో ఎస్పీ, జేసీ, సబ్ కలెక్టర్ తదితరులు



పాల్గొన్న అధికారులు

● కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ఒంగోలు టౌన్: వివిధ హోదాల్లోని అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో ప్రకాశం జిల్లాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లగలిగానని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. బదిలీపై అల్లూరి జిల్లాకు వెళుతున్న ఆయనకు జిల్లా అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన వీడ్కోలు సభలో పలువురు అధికారులు విధి నిర్వహణలో కలెక్టర్‌తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. జిల్లాను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడంలో తన వంతు ప్రయత్నం చేశానని చెప్పారు. ఈ క్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందించిన సహకారం ఎన్నటికీ మరచిపోలేనన్నారు. బాధితులకు సాయం చేస్తూ వారికి అండగా నిలవడం ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని స్పష్టం చేశారు. తాను కూడా తన బాధ్యతను నిర్వర్తించానని చెప్పారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు, జిల్లా రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల సమన్వయం వల్లనే సాధ్య మైందని, అన్ని శాఖలను సమన్వయ పరచడంలో కలెక్టర్ దినేష్ కుమార్ పాత్ర ఎంతో కీలకమైందని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అన్నారు. అనంతరం కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్, కలెక్టర్ సతీమణి విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణ, ఏఎస్పీ కె. నాగేశ్వరరావు, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో శ్రీలత, వివిధ శాఖల అధికారులు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కృష్ణ మోహన్, ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు శరత్, ఏపీ జీఈఎఫ్ నాయకులు చిట్టిబాబు, వీఆర్వో అసోసియేషన్ నాయకులు ఆదిరెడ్డి, దళిత సంఘాల నాయకులు బిళ్లా చెన్నయ్య తదితరులు ప్రసంగించారు.

సమస్యలు పరిష్కరించండి

ఒంగోలు సెంట్రల్: జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్రను మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి. రఘుబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి జనార్దన్ రెడ్డి, డి. శ్రీనివాసులు బృందంతో కలిసి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. భాషా పండితుల సీనియారిటీ జాబితా, వివేకానంద విద్యా విహార్‌లో సస్పెన్షన్‌కు గురైన ఇరువు ఉపాధ్యాయుల సస్పెన్షన్ కాలం రెగ్యులర్ చేయడం కోసం రిపోర్టు సీఎస్సీకి పంపాలని, అన్ని కేడర్లలో సీనియారిటీ జాబితాలను ప్రకటించాలని, కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని సమస్యలను ఈనెల 29నాటికి తప్పనిసరిగా పరిష్కారం చూపుతానని చెప్పినట్లు సంఘ బాధ్యులు తెలిపారు. 2019 నుండి ప్రమోషన్ తీసుకున్న ఉపాధ్యాయుల రెగ్యులైజేషన్ , ప్రొబేషన్ గురించి డీఈఓను అడుగగా జులై నెల మొదటి వారం ఆ ప్రక్రియ పూర్తి చేస్తానని చెప్పినట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు కె. తిరుమల, బి. శేషారావు, పి. హనుమంతరావు, ఖాదర్ బాష, టీబీ మల్లిఖార్జున రావు, కె.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీవారి కల్యాణం

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో షష్ఠమ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం భూనీలా సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు స్వామివారిని హనుమంత వాహనంపై ఊరేగించారు. అనంతరం 11 గంటలకు ఆలయ అర్చకులు అరుణ్‌స్వామి ఆధ్వర్యంలో అర్చకులు ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రతిష్ఠించి వివిధ రకాల ఆభరణాలు, పూలతో అలంకరించి కల్యాణ క్రతువును నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ టీపీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి కొండలరావు, అదనపు కార్యదర్శి నిట్టూరి రమేష్, కోశాధిగారి పిచ్చిరావు, ప్రతినిధులు రావిపాటి రాజా, విట్టా వెంకటేశ్వర్లు, ఆర్ రామారావు, టి.నరసింహారావు పాల్గొన్నారు.



పాల్గొన్న భక్తులు

వైభవంగా కనకదుర్గమ్మ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



పవిత్ర జలాలతో మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం నామ సంవత్సరం జేష్ఠ మాసం బహుళ చవితి స్థానిక మిలిటరీ కాలనీ యానాది సంఘంలో వెలసిన పోలేరమ్మ శ్రీ కనకదుర్గమ్మ వార్షికోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మహిళలు పవిత్ర జలాలతో తీసుకువచ్చిన జలాలతో ముందుగా అమ్మవారి మూలవిరాట్లకు పసుపు కుంకుమ గంధం విభూది చందనం కలిపి అమ్మవారికి శ్రీ సూక్తంతో అభిషేక నిర్వహించారు. అనంతరం కనకదుర్గ అమ్మవారి కనకధార స్తోత్రం దేవి ఖడ్గమాల అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించి అమ్మవారికి పంచ హారతులతో మంగళహారతి నిర్వహించారు. భక్తులు పోలేరమ్మకి పొంగలి నైవేద్యంగా పెట్టుకొని వారి మొక్కులు తీర్చుకున్నారు.

గరుడ వాహనంపై తిరుమలనాథస్వామి



ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి సమీపంలో వెలసిన గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్చకులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, రంగు రంగు పూలతో అలంకరించారు. పగలు ఉత్సవం పల్లకిలో సోమవారం రాత్రి ఉత్సవం గరుడ వాహనంపై కొలువు దీర్చారు. ఆలయ మాఢ వీధులు, ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కోరిన కోర్కెలు తీర్చాలని మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయం ప్రాంగణంలో అంజనేయస్వామి, నవగ్రహాలు, నాగయ్య, విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. చట్లమిట్ల గ్రామానికి చెందిన విశ్రాంతి ఉద్యోగి కందుల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. బ్రహ్మణ, ఆర్యవైశ్య, రెడ్ల, యాదవ సత్రాల్లో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం రథోత్సవం సందర్భంగా రాత్రి రెండు ఎలక్ట్రికల్ ప్రభలు, డ్రామాలు, కోలాటం ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కేజీబీవీలో దోమల నివారణకు చర్యలు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు కస్తూర్బా గాంధీ పాఠశాలలో కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాలతో వైద్య సిబ్బంది మలాథియాన్ పిచికారీ చేశారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టినట్లు సబ్ యూనిట్ అధికారి నాగేంద్రరెడ్డి పేర్కొన్నారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారుతీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ కాలేషా, అనంతలక్ష్మి, మెడికల్ సిబ్బంది పి అనురాధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో నీటి ఇబ్బందులు



వాహనాల్లో నీరు తెచ్చుకుంటున్న ప్రజలు

పెద్దదోర్నాల: నీటి కష్టాలు మండల ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఎందా కాలం ఎలాగోలా సర్దుకున్నా ట్యాంకర్ల మార్పిడి ప్రక్రియతో మూడు రోజుల నుంచి అసలైన నీటి ఇబ్బందులను మండల ప్రజలు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో నీటి తోలకం బాధ్యతను అధికార పార్టీ నాయకులు కైవసం చేసుకొన్నారు. కొద్ది రోజులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ట్యాంకర్లను నడుపుతూ నీరు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో వారికి ఈ నెలాఖరు వరకు నీటి సరాపరా చేసేందుకు అవకాశం ఉంది. అయితే మండల టీడీపీ నాయకులు కాస్తంత ముందుగానే ట్యాంకర్ల కోసం పట్టుబట్టి ఈ నెల 23వ తేదీ లోపే పాత ట్యాంకర్లను నిలిపి వేశారు. టీడీపీ నాయకులు ట్యాంకర్లను ఏయే ప్రాంతంలో పెట్టాలా అనే విషయంలో మ్యాపింగ్ కాక పోవడంతో మూడు రోజులుగా ట్యాంకర్ల ద్వారా నీటి సరాపరా నిలిచిపోయింది. దీంతో మండల ప్రజలు మూడు రోజుల నుంచి నీటికి అల్లాడిపోయే పరిస్థితి ఏర్పడింది. టీడీపీ నాయకుల ట్యాంకర్లు మ్యాపింగ్ అయ్యేంత వరకైనా ట్యాంకర్లను నడపించకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. దీంతో పాటు పలు చోట్ల ఖాళీ బిందెలతో ప్రజలు రోడ్లపై నిరసనలకు పాల్పడుండటం అధికారులు చిత్తశుద్ధిగా బాధ్యతలు నిర్వహించక పోవటంపై పలు విమర్శలకు తావిస్తోంది. తెలుగుదేశం నాయకులకు సంబంధించిన ట్యాంకర్లు రంగంలోకి దిగే వరకైనా అధికారులే నీటి ట్యాంకర్లను నడిపి ప్రజల ఇబ్బందులను తొలగించాల్సిందిగా మండల ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఇందిరాప్రసాద్ కోరారు. మంగళవారం మండలంలోని యండ్రపల్లిలోని ఎంపీయూపీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులు పరిశీలించి విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు వచ్చిన స్టూడెంట్ కిట్ పంపిణీ గురించి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి యూనిఫాం వేసుకుని పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించి విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

నూరు శాతం అక్షరాస్యత ఉండాలి



కొత్తపట్నం బస్టాండ్‌లో నేను బడికిపోతా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొత్తపట్నం: పేద విద్యార్థులంతా మధ్యలోనే చదువు ఆపకుండా నూరు శాతం అక్షరాస్యత సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య అన్నారు. మంగళవారం కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎంఈవోలు -1,2 తులసి కుమారి, పద్మావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలచెన్నయ్య మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల్లోపు బడి ఈడు పిల్లలు కేవలం బడుల్లోనే ఉండాలని ఉపాధ్యాలతో పాటు తల్లిదండ్రులు సహకారం అందించాలన్నారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్ సంఖ్య తగ్గించడం కోసం ప్రభుత్వం మధ్యాహ్న భోజనం.. విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు పంపిణీ చేస్తోందని.. దానిని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. తొలుత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవి అధ్యక్షతన విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ సాయి కిషోర్, ఫయాజ్, భాను ప్రతాప్, జీవశాస్త్ర ఉపాధ్యాయులు ధనలక్ష్మి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయ సెక్రటరీ హరిబాబు, సీఆర్పీ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

విడి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న సహాయ సంచాలకులు

బేస్తవారిపేట: విత్తన అమ్మకపు దుకాణదారులు ప్యాక్ చేసిన కంపెనీ విత్తానాలను మాత్రమే విక్రయించాలని, లూజు (విడి) విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఈ.వెంకట రమణ హెచ్చరించారు. మంగళవారం బేస్తావారిపేట, జంక్షన్‌లోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. విడి విత్తనాలను అమ్మకాలు చేస్తే విత్తన చట్టం ప్రకారం డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, రిజిస్టర్లు, బోర్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. విత్తన దుకాణాల్లో విత్తనాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపాలని వ్యవసాయశాఖ ఏఓకు సూచనలు ఇచ్చారు. షాపుల్లో విత్తనాల నిల్వ రిజిస్టర్‌లు, రశీదులు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ తనిఖీ చేశారు. సరైన ధృవీకరణ లేనటువంటి 26 క్వింటాళ్ల రూ.12 లక్షల విత్తనాల ప్యాకెట్ల అమ్మకాలను నిలుపుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి 19వ ప్రతిష్ఠ మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

మార్కాపురం: మార్కాపురం పట్టణ నడిబొడ్డున ఉన్న అయ్యప్పస్వామి దేవస్థాన 19వ ప్రతిష్ఠ వార్షికోత్సవం ఈనెల 16 నుంచి ప్రారంభమై మంగళవారంతో ముగిసింది. ఉదయం 6 గంటలకు అయ్యప్పస్వామికి గణపతి హోమం, అనంతరం మహాకళశాభిషేకంలో భాగంగా వివిధ రకాల పండ్ల రసాలు, పాలు, తేనే, పెరుగుతో అభిషేకం అనంతరం నగరోత్సవాన్ని నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు తాడువాయి గోపాలమల్లిఖార్జునరావు, కార్యదర్శి పడుచూరి కృష్ణయ్య, కోశాధికారి పీవీ సత్యమోహన్, ఉపాధ్యక్షుడు గుంటక వెంకటరెడ్డి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కళ్యాణం



స్వామివారి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

కంభం:

పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికళ్యాణంఘనంగా నిర్వహించారు. భక్తులు సతీసమేతంగా కళ్యాణంలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.